

రేషన్‌కార్డు దరఖాస్తుదారులతో కిక్కిరిసిన ముషీరాబాద్ మీసేవ కేంద్రం

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల వెల్లువ

ముషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభం కావడంతో ముషీరాబాద్‌లోని మీసేవ కేంద్రానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లి దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం నుంచి మీసేవ వద్ద బారులు తీరారు. దరఖాస్తుతో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, విద్యుత్ బిల్లు స్కాన్ చేసి స్వీకరించారు. కాగా, ముషీరాబాద్ మీసేవ కేంద్రంలో మంగళవారం ఒక్కరోజే 240 దరఖాస్తులు స్వీకరించినట్లు కేంద్రం ఇన్‌చార్జి తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

● కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్‌లోని పలు ప్రాంతాలలో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ యాకర అమృత ట్రాన్స్‌కో అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ శివకుమార్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్, భాగ్యనగర్, వినాయకనగర్, గోల్నాక కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని కార్పొరేటర్ తెలియజేశారు. స్పందించిన జాయింట్ కమిషనర్ వెంటనే నూతన వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ కార్పొరేటర్‌కు హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు ఎం.బీ.కిషోర్, కేజే బాబు పాల్గొన్నారు.

'సర్వే'లో మున్నూరు కాపుల జనాభాను తక్కువ చూపించడం అన్యాయం

● ఆరే దశరథం పటేల్

రాంనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కులగణన సర్వేలో మున్నూరుకాపుల జనాభాను తక్కువగా చూపించడం అన్యాయం అని తెలంగాణ మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరే దశరథం పటేల్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో దాదాపు 40 లక్షలకు పైగా మున్నూరుకాపులు ఉన్నారన్నారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 23 లక్షల మంది మున్నూరుకాపులు ఉన్నట్టు చూపించారని, నాటి నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఒకటి నుంచి రెండు శాతం జనాభా పెరిగిందన్నారు. ప్రస్తుత సర్వేలో ఆ లెక్కల ప్రకారం చూపించకపోవడం వెనుకు కుట్ర దాగి ఉందని ఆరోపించారు. మున్నూరుకాపుల లెక్కలపై ప్రభుత్వం పునః సమీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు రాజేష్‌పటేల్, విజయ్, అశోక్, అభిషేక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ కన్నె ఉమాదేవిని సత్కరిస్తున్న లంకల దీపక్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్తాం

●బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి స్పష్టం చేశారు. హామీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మంగళవారం కాచిగూడ నింబోలిఅడ్డ డివిజన్ అభివృద్ధి కార్యాలయం వద్ద కన్నె ఉమాదేవి కార్పొరేటర్‌గా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు నిండిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న లంకల దీపక్‌రెడ్డి కార్పొరేటర్ కన్నె ఉమాదేవిని శాలువతో సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్; ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు .సూర్యప్రకాష్‌సింగ్, శ్యామ్‌రాజ్, క్షీరసాగర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



బుర్రకథ కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆధునిక కాలానికి తగ్గట్టుగా గాంధీ బుర్రకథ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గతంలో బుర్రకథలను పౌరాణిక చారిత్రక అంశాలు ఆధారంగా చెప్పేవారు అయితే, త్యాగరాయ గానసభలో జరుగుతున్న డా. కేవీ రమణాచారి జన్మదిన వేడుకల్లో భాగంగా ఎడ్ల ప్రేమేందర్ బృందం మహాత్మాగాంధీజీ జీవిత చరిత్రను ఆధునిక కాలానికి తగినట్టుగా చెప్పి ఆకట్టుకున్నారు. గాంధీ జననం నుంచి బారిస్టర్ చదువుకు దక్షిణ ఆఫ్రికా వెళ్లడం, అక్కడ తెల్లవారిచే వివక్షత ఎదుర్కోవడం, భారత్‌కు రావడం, అహింస, సత్యం ఆయుధాలుగా బ్రిటిష్ వారిపై స్వాతంత్ర్య పోరాటం ఇలా శ్రోతలకు ఆసక్తి కలిగించే విధంగా చెప్పారు. చివరగా గాంధీజీ హత్యను మనస్సు కదిలించేలా వర్ణించారు. అనంతరం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి కథకులను సత్కరించారు. పాలకవర్గ సభ్యులు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు తదితరులు

మహాదేవ మణి కవిత్వం దివ్యం, సశాస్త్రీయం

● ప్రముఖ కవి జొన్నవిత్తుల

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్యపర్చడం కవి లక్ష్యమైతే మహాదేవ మణి కవిత్వం దివ్యమైనది, సశాస్త్రీయమైనదని ప్రముఖ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. ఉపాసన సంస్థ ఆధ్వర్యంలో బృహత్ శ్రీధరీయం కావ్య ఆవిష్కరణ మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా జొన్నవిత్తుల పాల్గొని కావ్యాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు భాష అంతరించి పోతున్న సందర్భంలో భాషా పరిరక్షణకు కంకణం కట్టుకున్న సంస్కృతీమణి మహాదేవ మణి అని చెప్పారు. సాహితీవేత్తలు ఎం.సూర్యనారాయణ మూర్తి, భాషా పండితుడు శ్రీరామ్‌నాథ్, ఎం. దత్తాత్రేయశర్మ ఎం వెంకటరమణ శర్మ, అవధాని బులుసు అపర్ణ తదితరులు పాల్గొన్నారు. సంస్థ నిర్వాహకులు డా. మహేశ్వరి. డా. సీతాపతి, కల్యాణి, దివాకర్‌రావులు మహాదేవ మణిని ఉపాసన అవార్డ్‌తో సత్కరించారు.

డీఎంసీ లేక కుంటుపడ్డ పాలన

● ముషీరాబాద్ సర్కిల్‌కు ఇన్‌చార్జి డీఎంసీనే దిక్కు

● పని భారంతో పెండింగ్ పడ్డ ఫైళ్లు

● ముందుకు సాగని పనులు

రాంనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఉన్న ముషీరాబాద్ సర్కిల్‌క పూర్తిస్థాయి డీఎంసీ లేకపోవడంతో పాలన కుంటుపడింది. రోజువారీ ఫైళ్ల అనేకం పెండింగ్‌లో పడ్డాయి. అంతే కాకుండా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు, ఆస్తి పన్ను వసూళ్లు, రోజువారీగా వచ్చే ఫిర్యాదులతో పాటు జీహెచ్‌ఎంసీ అనుమతులకు సంబంధించిన అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇన్‌చార్జిపై అదనపు భారం..

ఇక్కడ డీఎంసీగా పనిచేసిన మహ్మద్ ఖాదర్ మొహినుద్దీన్ జనవరి 29వ తేదీన కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఆ బాధ్యతలను తాత్కాలికంగా అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీ దివాకర్‌కు అప్పగించారు. రెండు సర్కిళ్ల బాధ్యతలను ఒక్కరే నిర్వహించడం వల్ల సదరు డీఎంసీపై పని భారం అధికమైంది. ఆయనకు అన్ని సమస్యలను పరిష్కరించే సమయం లేకపోవడంతో ఫైళ్లు పెండింగ్ పడ్డాయి. దీంతో ఎంతో మంది ప్రజలు జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వచ్చి డీఎంసీ లేకపోవడంతో వెనుతిరిగి వెళ్తున్నారు.

కింది స్థాయి సిబ్బంది విధులకు డుమ్మా

ముషీరాబాద్ సర్కిల్‌కు పూర్తి స్థాయి డీఎంసీ లేకపోవడంతో కొంత మంది కింది స్థాయి సిబ్బంది ఆఫీసుకు రావడం లేదు. వచ్చిన వారు కూడా కుర్చీలో సరిగ్గా కూర్చోకుండా తమ సొంత పనుల్లో నిమగ్నమై ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. డీఎంసీ తర్వాత తదుపరి బాధ్యతలు నిర్వహించాల్సిన ఏఎంసీలు సిబ్బందితో పూర్తి స్థాయిలో పనులు చేయించలేకపో తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పూర్తిస్థాయి డీఎంసీ లేకపోవడంతో స్థానిక సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది జోనల్ కమిషనర్లు స్పందించి నూతన డీఎంసీని నియమించాలని ముషీరాబాద్ సర్కిల్ ప్రజలు కోరుతున్నారు.



అబిడ్స్‌లోని జీహెచ్‌ఎంసీ భవనం

డీఎంసీ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

నకిలీ వైద్యులను ప్రోత్సహిస్తే ఆరోగ్య సంక్షోభం

●ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి

నల్లకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నకిలీ వైద్యులను రాజకీయ ప్రయోజనాల కోసం ప్రోత్సహిస్తే రాష్ట్రంలో ఆరోగ్య సంక్షోభానికి దారి తీస్తుందని, ఇలాంటి చర్యలను రాజకీయ పార్టీలు తక్షణమే మానుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకానాథ్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అశోక్, యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ అశోక్ రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైద్య అర్హతలు లేని ఈ నకిలీ వైద్యులు కేవలం ఫస్ట్ ఎయిడ్ సేవలకు మాత్రమే అర్హులని, రాష్ట్రంలో వీరి ప్రాక్టీస్‌ను తక్షణమే నిషేధించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. నకిలీ వైద్యులను అర్హులుగా చట్ట పరిధిలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను మానుకోవాలని అన్నారు. నకిలీ వైద్యులు గ్రామాలలో డాక్టర్లుగా బోర్డులు పెట్టుకుని పిల్లలకు, వృద్ధులకు మితిమీరిన స్టెరాయిడ్స్, మోతాదుకు మించి మందులు ఇస్తూ వారి ప్రాణాలను బలిగొంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిని రాజకీయ ప్రయోజనాలు, ఓట్ల కోసం వాడుకుని ప్రోత్సహించడం సరికాదన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ 34వ సెక్షన్ ప్రకారం వారిని నేరస్తులుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్, రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దువ్వూరు ద్వారకానాథ్‌రెడ్డి తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌భూషణ్ తదితరులు

'వర్గీకరణ' వివాదాన్ని పరిష్కరించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే

● 'బంధు సొసైటీ' సమావేశంలో పలువురు వక్తలు

రాంనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టం తీసుకువచ్చి 30 ఏళ్ల వివాదాన్ని పరిష్కరించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరణ గ్రూపులో జరిగిన స్వల్ప తేడాలను సవరించాలని వారన్నారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి అధ్యక్షతన సీఎం రేవంత్‌రెడ్డి, ఎస్సీ వర్గీకరణ కమిటీ సభ్యులకు కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న మాజీ ఐఏఎస్ అధికారి భరత్‌భూషణ్, బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ, తెలంగాణ జేఏసీ చైర్మన్ కోల జనార్దన్‌గౌడ్, ఎంఐఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నతానియోల్ తదితరులు మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణలో వర్గీకరణను పరిష్కరించారన్నారు. చట్టం ప్రకారం గ్రూప్ 1, 2, 4 ఉద్యోగాలలో ఎస్సీ వర్గీరణ ప్రకారం ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డ యాదయ్య, మహా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎం.నర్సింగ్‌రావు, అంబేద్కర్ - పూలే మహిళా సంఘం అధ్యక్షురాలు బాకారం లావణ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గండి కృష్ణ, బంధు సేవా మండలి నాయకులు డీఎం అశోక్‌కుమార్, నాయకులు గొల్లపల్లి దయాకర్‌రావు, శ్రీనివాసులు, బెజ్జంకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ జాగృతి సీనియర్ నాయకుడు కె.ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం జాగృతి కార్యాలయంలో ఆవిష్కరించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తదితరులు. - (అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి)



అంబర్‌పేట ఛేనెంబర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఆలయాన్ని పునర్నిర్మించాలని బీజేపీ ధర్నా

గోల్నాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు ఛేనెంబర్ రోడ్డులోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని పునర్ నిర్మించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ సీనియర్ నాయకుడు కె.రాంచందర్ నేతృత్వంలో పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ, అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణం పనులు ప్రారంభానికి ముందు కాంట్రాక్టర్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని పునర్నిర్మిస్తానని హామీ ఇచ్చారని, ఫ్లైఓవర్ పూర్తయినా ఇప్పటి వరకు ఆలయ నిర్మాణం చేపట్టలేదని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టర్ గోపాల్‌రెడ్డి ఆలయ పునర్నిర్మాణం చేపట్టకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా, త్వరలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సౌజన్యంతో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. ధర్నాలో బీజేపీ నాయకులు వై. దామోదర్‌నాయుడు, బి.ఈశ్వర్‌రావు, సునీల్, గణేస్, గట్ల రమేష్, ఆర్కే చందు, గోపాల్, దుంపల జ్ఞానేశ్వర్, శివసేన రాష్ట్రనాయకులు సుదర్శన్ పాల్గొన్నారు.

లఘుచిత్రాలను ప్రోత్సహించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లఘుచిత్రాలను ప్రోత్సహించాలని సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ అన్నారు. లంకాపురంలో రావణకాష్టం లఘుచిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం సాయంత్రం త్యాగరాయగానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దైవజ్ఞశర్మ మాట్లాడుతూ లఘుచిత్రాలు తక్కువ నిడివితో ఉన్నప్పటికీ సమాజానికి మంచి సందేశం ఇస్తాయన్నారు. ఎంఎఫ్‌సీసీ ఐడీ కార్డు ఉన్న వారిని ఈ లఘుచిత్రంలో నటీనటులుగా తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ జడ్జి బూర్గుల మధుసూదన్, నిర్మాత డా. మాదాల నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస దీక్షలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాంనగర్‌లోని పార్థన వీరుల చర్చిలో 40 రోజులపాటు నిర్వహించిన ఉపవాస దీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సామూహిక ప్రార్థనలు, ఏసుక్రీస్తు భక్తి గీతాల ఆలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాస్టర్ మేరీలీనా మాట్లాడుతూ... సమాజ శ్రేయస్సుతో పాటు ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు గత 27 ఏళ్లుగా చర్చిలో ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

విద్యుత్ దీపాల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

●ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ విమర్శించారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్ ఫ్రెండ్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను కాలనీకి ఆహ్వానించి స్థానిక సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కృష్ణగౌడ్ తదితరులు ఎమ్మెల్యేకు సమస్యలను వివరించారు. విద్యుత్ దీపాలు వెలగడం లేదని, టైమర్లు పనిచేయడం లేదని, వీధి కుక్కల బెడద అధికంగా ఉందని చెప్పారు. కాలనీలోని పార్కు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణ పనులు చేపట్టడంతో వీధులు ఇరుకుగా మారి ఇబ్బందులు ఏర్పడు తున్నాయన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వివరించి వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వీధి దీపాల నిర్వహణ పనులు చూసే కాంట్రాక్టర్లకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో వారు విధులు నిర్వహించడం లేదని ఆరోపించారు. ఫ్రెండ్స్ కాలనీ పార్కు చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతోపాటు వాచ్‌మెన్‌ను నియమించేలా చర్యలు తీసుకుంటా మన్నారు కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు పూసగొరక్‌నాథ్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ నాయకులు శివ ముదిరాజ్, టెంట్ హౌస్ శ్రీనివాస్, ఎయిర్‌టెల్ రాజు, సత్యనారాయణబాబు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్‌కు గుర్తింపు కార్డుల పంపిణీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సమావేశం మంగళవారం ముషీరాబాద్‌లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్‌కు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ... ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమకు డబుల్ బెడ్‌రూం, తెల్లరేషన్‌కార్డులు ఇప్పించాలని కోరారు. అసోసియేషన్ ఏర్పాటుకు ముషీరాబాద్ మండలంలో స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ... ఎలక్ట్రికల్ టెక్నీషియన్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రఘు, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, ఉపాధ్యక్షుడు మహేష్, కార్యదర్శులు సిద్దు, ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ కమర్, కార్యనిర్వాహక కార్యదర్శి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెండ్స్ కాలనీలోని సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

తెలంగాణకు ఐఐఎం మంజూరు చేయండి

●కేంద్ర మంత్రికి ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ వినతి

రాంనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) మంజూరు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్ మంగళవారం ఢిల్లీలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రానికి ఐఐఎం చాలా అవసరమని అన్నారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ హబ్‌గా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, బహుళజాతి సంస్థలకు అనుకూలమైన సెంటర్‌గా మారిందని కేంద్రమంత్రికి వివరించామన్నారు. సాఫ్ట్‌వేర్ మౌలిక వసతుల కోసం రాష్ట్రానికి ఐఐఎం మంజూ రు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు.



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

చిలుకూరి ఆలయ అర్చకుడిపై దాడి హేయం

● బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు

నల్లకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మపరిరక్షణ కోసం పాటు పడుతున్న బ్రాహ్మణులపై దాడులు తగదని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. అర్చకులు భగవంతుడి సేవలో సమాజ శ్రేయస్సు కోసం నిత్యం తపిస్తూ ఉంటారని, అలాంటి అర్చకులపై దాడి చేయడం శోచనీయమన్నారు. మంగళవారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో ఆయన విలేకరరులతో మాట్లాడారు. చిలుకూరు శ్రీబాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పూజారులకు భద్రత కోసం ప్రత్యేక రక్షణ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, చెన్నూరి లక్ష్మీనరసింహారావు, మంత్రి సునీల్, దేశ్‌ముఖ్ రమాకుమార్, దేవులపల్లి అశోక్‌కుమార్, గూడా జయరాం, కానాల శ్యాంసుందర్‌రావు, అక్కిరాజు దుర్గాప్రసాద్, ఎం.గిరి, కరకంపట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు, పేద ప్రజల కోసం స్వచ్ఛంద సంస్థలు ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని జిప్స్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ నిరంజన్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని ఆయన అన్నారు. మంగళవారం కవాడిగూడ తాళ్లబస్తీలో జిప్స్ సంస్థ సహకారంతో వైఫోర్‌డి ఫౌండేషన్, జనని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. పలు పాఠశాలల విద్యార్థులు, నిరుపేదలకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. 171 పరీక్షలు చేయించుకోగా, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జనని ఫౌండేషన్ అధ్యక్షుడు రాచకొండ మల్లేష్‌బాబు, వైఫోర్‌డి సూర్య, అరవింద్, శ్రీనివాస్, లక్ష్మి. నరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పీఎఫ్ కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి

●తెలంగాణ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లకు కరువు భత్యంతో కూడిన కనీస పెన్షన్ 9 వేల రూపాయలు చెల్లించాలని తెలంగాణ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ చైర్మన్ ఎంఎస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.నరహరి, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, కన్వీనర్ ఎస్.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యం చెల్లించాలని, తక్షణమే హయ్యర్ పెన్షన్‌ను అందరికీ వర్తింపచేయాలని,ఈపీఎఫ్ నిధుల ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీఎఫ్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు అరుణ, చెన్నకేశవులు, శంకర్‌రావు, రాధాకృష్ణ, రామారావు, కమలకుమారి పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం

బీజేపీ సికింద్రాబాద్ మహాకాళి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గుండగోని భరత్‌గౌడ్‌ను చిక్కడపల్లిలో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సూర్యనారాయణశర్మ, సికింద్రాబాద్ జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ తొలుపునూరి రమేష్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు సుబ్రహ్మణ్యంబాబు.

- (రాంనగర్, ఆంధ్రజ్యోతి)

డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌కు సన్మానం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ, జాతీయ సమైక్యత, మతసామరస్యం, యువజన విద్యార్థి సంక్షేమం కోసం ఎనలేని సేవలందిస్తున్న తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను మంగళవారం శాలువ, పూలబొకే, జ్ఞాపికతో ఘనం సత్కరించారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌ప్రొఫెసర్ కుమార్ నివాసంలో ఈ సత్కారం జరిగింది. జస్టిస్ వామన్‌రావు, ప్రొఫెసర్ సూర్య.ధనుంజయ్, పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి అధికారి రవితేజ, ఓయూ ప్రొఫెసర్లు మేజర్ జయసుధ, డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న ఓయూ వీసీ ప్రొ. కుమార్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో మంగళవారం జరిగింది. అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ కథనం ప్రకారం.. బర్కత్‌పుర నివాసి సౌరభ్ (43) నాటకాలలో నటిస్తూ స్క్రిప్ట్ రాస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యతో గొడవ జరగడంతో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఇదిలా ఉండగా, మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన తల్లి తలుపు కొట్టగా ఎంతకూ తీయలేదు. దీంతో ఆమె కిటికీ లోంచి చూడగా సౌరభ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని చికెన్ వ్యాపారి మృతి

రైలు ఢీకొని చికెన్ వ్యాపారి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప కథనం ప్రకారం.. ఉప్పుగూడ నివాసి రంగరాజ్ (48) చికెన్ వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం ఉందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.